# అన్ని సమస్యలూ పరిష్కరిస్తాం..

- విజయుడిని భారీ మెజార్టీతో గెలిపించండి
- నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి
- గులాబీ పార్టీకి హ్యాట్రిక్ విజయం అందించాలి
- అలంపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడు
- అలంపూర్ మండలంలో విస్తృతంగా ప్రచారం


సింగవరంలో ఎమ్మెల్సీ చల్లా, బీఆర్ఎస్ అభ్యర్థి విజయుడిని పూలమాలలతో సన్మానిస్తున్న గ్రామస్తులు

అలంపూర్, నవంబర్ 16 : పవిత్రమైన ఓటును వృథా చేయకుండా బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి తమ విలువ పెంచుకోవాలని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి సూచించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం అలంపూర్ మండలంలో ఇంటింటి ప్రచారం అనంతరం రోడ్ షోలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ పార్టీ బలపర్చిన మీ అభిమాన బిడ్డ, స్థానికుడు, మనందరికీ సుపరిచితుడు విజయుడిను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపిస్తే మన నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్సీ దృష్టికి పలు సమస్యలు తీసుకొచ్చారు. గ్రామానికి బస్ సౌకర్యం కల్పించాలని, ఎత్తిపోతల పథకం మంజూరు చేయాలని, ఆర్డీఎస్ డీ–40 చివరి ఆయకట్టు వరకు సాగునీరందించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ బీఆర్ఎస్ అభ్యర్థి విజయుడిని గెలిపిస్తే ఎన్నికల అనంతరం అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని హామీ ఇచ్చారు. గతంలో సీఎం కేసీఆర్ పల్లెప్రగతిలో భాగంగా గ్రామాల్లో చాలా సమస్యలు పరిష్కరించారన్నారు. మిగతా పనులు తప్పకుండా పూర్తి చేస్తామని, కారు గుర్తుపై ఓటు వేసి విజయుడిని ఆశీర్వదించాలని కోరారు.

**అభివృద్ధి చేసే పార్టీనే ఆదరించాలి**

పల్లెలను అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ పార్టీనే రాబోయే ఎన్నికల్లో ఆదరించి గెలిపించాలని ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడు కోరారు. ముచ్చటగా మూడోసారి గులాబీ పార్టీని గెలిపించి హ్యాట్రిక్ విజయం కట్టబెట్టాలని కోరారు. ప్రచారంలో భాగంగా అలంపూర్ మండలంలోని కాశీపురం, సింగవరం, ర్యాలంపాడు, సుల్తానాపురం, జిల్లెలపాడు, క్యాతూర్, భీమవరం, గుందిమల్ల, లింగనవాయి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, నూతన మ్యానిఫెస్టోలోని అంశాలను వివరించి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కాగా ఆయా గ్రామాల్లో ప్రజలు బీఆర్ఎస్ అభ్యర్థికి బ్రహ్మరథం పట్టారు. పూలు చల్లుతూ మేళతాళాలతో తండోపతండాలుగా తరలి వచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.


బీఆర్ఎస్‌లో చేరిన కుచినేర్ల వాసులతో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

# కారెక్కిన కమలం నేతలు

- కార్యకర్తలను కాపాడుకుంటాం..
- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి
- గులాబీ తీర్థం పుచ్చుకున్న సర్పంచ్ హైమావతమ్మ
- బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు

కేటీదొడ్డి, నవంబర్ 16 : కేటీదొడ్డి మండలంలోని కుచినేర్ల సర్పంచ్ (బీజేపీ పార్టీకి చెందిన) హైమావతమ్మ, ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సమక్షంలో గురువారం గులాబీతీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని గుర్తించి పల్లెల్లోని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. తన మీద నమ్మకంతో వచ్చిన ప్రతి కార్యకర్తనూ కడుపులో పెట్టుకొని చూసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. అన్నం తిని సున్నం అనకూడదనే బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నామన్నారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో ఉప సర్పంచ్ వెంకట్, బీజేపీ సీనియర్ నాయకులు నర్సప్ప, కిషన్‌రావు, సతీశ్‌కుమార్, అడవి స్వామి, శరణమయ్యప్ప, గురుపాదయ్య, అక్షయస్వామి, తలారి భీమయ్యతో పాటు 200మంది ఉన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, గ్రంథాలయాల సంస్థ జిల్లా చైర్మన్ రామన్‌గౌడ్, జెడ్పీటీసీ రాజశేఖర్, వైస్ ఎంపీపీ రామకృష్ణనాయుడు, బాసు హనుమంతునాయుడు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

**అభివృద్ధికి ఆకర్షితులై..**

గద్వాల, నవంబర్ 16 : బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధికి ఆకర్షితులై గద్వాల నియోజకవర్గంలోని ఆయా గ్రామాల కాంగ్రెస్, బీజేపీ, ఇతర పార్టీల నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారు. బుధవారం ధరూర్ మండలం ఓబులోనిపల్లెకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన కార్యకర్తలు హనుమంతు, గోపాల్, మహేశ్, ధరూర్ రామన్న ఆధ్వర్యంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు చెట్టుకింద దేవన్న, నాగరాజు, రాజు తదితరులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. రేకులపల్లెకు చెందిన కాంగ్రెస్ నాయకులు, మత్స్యకారుల సంఘం నాయకులు రమేశ్, మధు, శివ, సంజీవులు, ఈరన్న, కాశీం, అంజి, కురుమన్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కారెక్కారు. వీరందరికీ ఎమ్మెల్యే బండ్ల గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, గద్వాల కౌన్సిలర్ దౌలు, శ్రీను, కోటేశ్, లక్ష్మన్న, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# పక్కాగా.. ధాన్యం కొనుగోళ్లు

- నాణ్యతా ప్రమాణాలు పాటించాలి
- రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవు
- సకాలంలో డబ్బులు జమ చేయాలి
- గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలి: కలెక్టర్ వల్లూరు క్రాంతి

గద్వాల అర్బన్, నవంబర్ 16 : రైతులకు ఇబ్బందులు కలుగకుండా, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ధాన్యం సేకరించాలని అధికారులను కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. గురువారం సమీకృత కలెక్టర్‌లోని సమావేశ హాల్‌లో సంబంధిత అధికారులతో సమావేశమై మాట్లాడారు. తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవవన్నారు. తేమ శాతం, నాణ్యతా ప్రమాణ పరీక్షలు, ధాన్యం సేకరించిన తర్వాత రైతుల ఖాతాల్లో సకాలంలో డబ్బులు జమ చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో తేమ పరిశీలన యంత్రాలు, ప్యాడీ క్లీనర్స్ సిద్ధం చేసుకోవాలన్నారు. రైతులకు సరిపడా గన్నీ బ్యాగులు అందించాలని, కేంద్రాల్లో వ్యవసాయ అధికారులు, పీపీసీ సెంటర్ ఇన్‌చార్జిలు సంక్రమంగా విధులు నిర్వర్తించాలన్నారు. పంట కొనుగోలు సమయంలో రైతులకు ఏఈవోలు ఇచ్చే టోకెన్ల అధారంగా ధాన్యాన్ని సేకరించాలని సూచించారు. డీఆర్డీవో, ఐకేపీ, మెప్మా అధికారులు ఎప్పటికప్పుడు కేంద్రాలను విజిట్ చేస్తూ ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వమే ధాన్యానికి కనీస మద్దతు ధర క్వింటా గ్రేడ్ ఏ రకానికి రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 చెల్లిస్తుందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం తేమ 17శాతం కంటే తక్కువ ఉండేటట్లు చూసుకోవాలని సూచించారు. చెత్త, తాలు, మట్టిపెడ్డలు, రాళ్లు ఎక్కువ రాకుండా పరీక్షించి కొనుగోలు చేయాలన్నారు. నిబంధనల ప్రకారం పరీక్షలు చేయాలని, విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ధాన్యం నిల్వ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు ధాన్యం మిల్లులకు తరలించడానికి తగినన్ని వాహనాలు, హమాలీలను సమకూర్చుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ధాన్యాన్ని కల్లం నుంచి మిల్లులకు నేరుగా తరలించరాదని, కచ్చితంగా కొనుగోలు కేంద్రాలకే తీసుకురావాలన్నారు. తూకం అనంతరం రైతులు విధిగా రసీదులు పొందాలన్నారు. ధాన్యం అమ్ముకోవడంలో రైతులకు సమస్యలు ఎదురైతే సంబంధిత పౌర సరఫరాల అధికారులు, ఆర్డీవో, తాసీల్దార్‌ను లేదా సంబంధిత వ్యవసాయాధికారులను సంప్రదించాలని సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లా కేంద్రాలకు ధాన్యం తరలించకుండా చెక్‌పోస్టులలో నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఏఈవోలు, ఐకేపీ, మెప్మా, సహకార పరపతి కేంద్రాల నిర్వాహకులకు పీపీటీ ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 2023–24 వానకాలం ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్ అవగాహన శిక్షణా శిబిరానికి సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాసులు, డీఆర్డీవో జిల్లా ఇన్‌చార్జి కాంతమ్మ, డీఎస్‌వో రేవతి, జిల్లా మార్కెటింగ్ అధికారి పుష్ప, వ్యవసాయశాఖ జిల్లా అధికారి గోవిందునాయక్, అధికారులు ప్రసాద్‌రావు తదితరులు ఉన్నారు.


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ క్రాంతి, అధికారులు

# కాంగ్రెస్‌కు ఓటేస్తే.. ఢిల్లీ నవాబులకు గులామే

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్, నవంబర్14 : కాంగ్రెస్‌కు ఓటేస్తే ఢిల్లీ నవాబులకు గులామే అని, వారి మొసలి కన్నీళ్లకు మొసపోవద్దని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం తుర్కోనిపల్లి, ముల్కలపల్లి, తెల్గోనిపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే పర్యటిస్తూ అభివృద్ధి, సంక్షేమ పథకాలు, బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ముల్కలపల్లి, తెల్గోనిపల్లి గ్రామాల్లో కాంగ్రెస్, బీజేపి నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గానికి నిస్వార్థంగా సేవ చేస్తున్న తనను ఆశీర్వదించాలని కోరారు. ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పే నాన్ లోకల్, టూరిస్టు నాయకుల ను తరిమికొట్టాలన్నారు. రైతు సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయమని, రాష్ట్రంలో కాంగ్రెస్ వస్తే మూడు గంటల కరెంటు, బీజేపీకి ఓటేస్తే మోటర్లకు మీటర్లు బిగిస్తారని అన్నారు. కర్ణాటకలో నమ్మి ఓటేసిన ప్రజలను నట్టేట ముంచారని, మళ్లీ తెలంగాణలో నాటకాలు వేస్తున్నారని మండిపడ్డారు. ఇక్కడి ప్రజలు వారిని నమ్మే స్థితిలో లేరని, కారు గుర్తుకు ఓటేసి తగిన బుద్ధి చెబుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. నియోకవర్గ అభివృద్ధిని చూసి మరోసారి ఆశీర్వదించాలన్నారు. పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో మూడోసారి కేసీఆరే ముఖ్యమంత్రి అని స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ పాలనలో సాగు, తాగునీటి కష్టాలు, కరెంటు కోతలు లేవన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీ నాయకుల కుట్రపూరితమైన మాటలు నమ్మొద్దన్నారు. నవంబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్‌ను, గద్వాల ఎమ్మెల్యేగా తనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాప్ గౌడ్, ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రమేశ్‌నాయుడు, సర్పంచులు మనెమ్మ, బీఆర్ఎస్ నాయకులు మహేశ్వర్‌రెడ్డి, నీలేశ్వర్‌రెడ్డి, శ్రీరాములు, శ్రీనివాసులు, చక్రధర్, అగ్గిరాముడు, బీచుపల్లి, శ్రీధర్, భీమేశ్‌రెడ్డి, వెంకటేశ్, మద్దిలేటి, సుధాకర్ రెడ్డి, వెంకటన్న, శేఖర్‌రెడ్డి, వేణు, రాముడు, యూత్ సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


తెల్గోనిపల్లిలో..


ముల్కలపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల